క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: మండలంలోని ముక్కమల్ల ప్రాథమిక పాఠశాల 8వ తరగతి విద్యార్థులు ఏపీ సైనిక్ స్కూల్‌లో 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు హెచ్ఎం నాగరాజు శనివారం తెలిపారు. జనవరి 8న దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షలో మహేష్‌బాబు, రాహుల్‌బాబు, సుకన్య, మానస, ప్రశాంత్, శ్వేత ఎంపికయ్యారని వివరించారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు జయచంద్రారెడ్డి, నాగశైలజతోపాటు విద్యార్థులకు హెచ్ఎం అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



నగదు అందజేస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన మృతుని కుటుంబానికి శనివారం వైఎస్సార్ బీమా సొమ్ము అందజేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీ దారుడు కావడంతో తక్షణ సాయంగా మృతుని భార్య రమణమ్మకు రూ.10వేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు నామిని ఖాతాలో జమఅవుతుందని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధిక, పంచాయతీ కార్యదర్శి శారద, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28న పట్టుబడిన వాహనాల వేలం

డోన్ టౌన్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన రెండు వాహనాలను ఈ నెల 28వ తేదీ వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ భీమలింగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్టేషన్‌లో మంగళవారం ఉదయం 9.30గంటలకు వేలం పాటలు నిర్వహిస్తామని, పాల్గొనే వ్యక్తులు ఆధార్‌కార్డుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వాహనాలు సొంతం చేసుకున్న వారు ఆ మొత్తంతోపాటు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుదన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి మల్లికార్జున

ప్యాపిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయ నూక్లియర్స్ వైద్యాధికారి మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఎయిడ్స్, క్షయ, కుష్ఠు వ్యాధులు ప్రబలకుండా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల గురించి రివ్యూ నిర్వహించారు. కుష్ఠు,క్షయ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేయాలని సూచించారు. వ్యాధి పూర్తిగా తగ్గిపోయే వరకు చికిత్స తీసుకునేలా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం ఆయన పీహెచ్‌సీలోని లేబర్, వ్యాక్సిన్, స్టోర్ రూమ్‌లతోపాటు ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వాణిశ్రీ,నితీష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

బేతంచెర్ల: నవరత్నాలు పేదలందరికి ఇల్లు పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 2వ సచివాలయం సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు యాభై శాతం పూర్తయిందని, వంద అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ జాబితాకు సంబంధించి ఆధార్ కార్డు అనుసంధానం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది తేజేశ్వర్‌రెడ్డి, గోపాలు, నరేంద్ర, మునేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి మొబైల్ ఆధార్ సెంటర్లు


కొలిమిగుండ్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 27 నుంచి రెండు రోజుల పాటు మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు శనివారం తెలిపారు. రెండు రోజుల పాటు తుమ్మలపెంట,పెట్నికోట గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా చేస్తామన్నారు. 5-15 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ సైతం ఉచితమన్నారు. ఆధార్‌లో అడ్రస్, మొబైల్ నంబర్ మార్పు కోసం రూ.50 సర్వీస్ చార్జ్ వసూలు ఉంటుందన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ!

- తీరుతున్న రాకపోకల ఇక్కట్లు
- ఇప్పటికే కొన్ని రోడ్లు పూర్తవ్వగా... మరికొన్ని వివిధ దశల్లో పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పల్లెల ప్రజలు



కళకళలాడుతున్న గూటుపల్లె గ్రామంలో పొలాల రహదారి



మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అంబాపురం చేపట్టిన మట్టి రహదారి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఇందులో భాగంగా ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో సాధారణ రోడ్లతోపాటు పొలాలు, ఆలయాలకు వెళ్లే రహదారులకు నిధులు మంజూరు చేయించడంతో ఏళ్లతరబడి గ్రామీణులు పడిన ఇబ్బందులు తీరుతున్నాయి. మండలంలో ఇప్పటికే కొన్ని రహదారులు పూర్తవ్వగా మరికొన్ని వివిధ దశల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ. 65 లక్షలతో మండల పరిధిలోని రహిమానుపురం నుంచి బుక్కాపురం గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి పూర్తయింది. బైనపల్లె గ్రామంలో 2.2 కిలోమీటర్ల రూ.15 లక్షలతో చేపట్టిన రోడ్డు పూర్తవుతుంది. గూటుపల్లె గ్రామంలోని పెద్దబావి నుంచి జక్కోల బావి వరకు పొలాల రహదారికి రూ.15 లక్షలతో చేపట్టిన రహదారి పూర్తయింది. ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్యలు తీరడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

శరవేగంగా జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

గ్రామీణ రహదారులు ఇప్పటికే కొన్ని పూర్తవ్వగా మరికొన్ని వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి. అంబాపురం నుంచి శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ రహదారికి రూ.40 లక్షలు మంజూరు కావడతో 3 కిలోమీటర్ల చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్ఎస్ రంగాపురం పొలాల రహదారి రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ రహదారి పనులు పూర్తయితే అంబాపురంతో పాటు ఆర్ఎస్ రంగాపురం గ్రామ ప్రజలు ఆలయానికి చేరుకోవడానికి సౌకర్యంగా మారడమే కాకుండా, ముచ్చట్ల నుంచి యాగంటి, మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఎంతో ఉపయోగ కరంగా మారనుంది. ముద్దవరం గ్రామంలోని పొలాలకు వెళ్లే బావి రస్తాకు రూ. 15 లక్షలు, అదే పంచాయతీలోని ముసలాయిచెర్వు గ్రామం నుంచి పిక్కిలివానిపల్లె రహదారికి రూ.10 లక్షలు, వీరాయపల్లె గ్రామంలోని మూడు వంకల రహదారికి రూ. 10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి.

సౌకర్యంగా మారుతున్న పొలాల రహదారులు



ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు మాగ్రామం మీదుగా యాగంటి, మద్దిలేటి స్వామి ఆలయానికి తక్కువ సమయంలో చేరుకోవడానికి ప్రస్తుతం వేస్తున్న గ్రావెల్ రోడ్లు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. దీనికి తోడు పొలాలకు వెళ్లే రైతులకు సైతం ఎంతో సౌకర్యంగా మారనున్నాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి. చంద్రశేఖర్ రెడ్డి, అంబాపురం గ్రామం

ప్రణాళిక ప్రకారం గ్రావెల్ రోడ్లు



మండలంలోని ఆయా గ్రామాల రైతులు, ప్రజల విన్నపం మేరకు పొలాలకు వెళ్లేందుకు ప్రణాళిక ప్రకారం గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నో సంవత్సరాలుగా సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. అన్ని గ్రామాల్లో రహదారి సమస్యలు పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

– బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీపీ

రవీంద్రారెడ్డిని గెలిపించండి

డోన్ టౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, దారా హరినాథరెడ్డి, మేకల విమల, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకలరాజు, రంగస్వామి కోరారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయన్ను గెలిపించాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో వారు ఇంటింటి ప్రచారం చేశారు.

పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన



కొత్తబస్టాండ్ సమీపాన జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలో ప్రధాన రహదారి వెంట జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను శనివారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు పైప్‌లైన్ ఏర్పాటుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 300 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఈ మేరకు చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి ప్రక్కన్న వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యుడు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి



మాట్లాడుతున్న ఏఓ పవన్‌కుమార్

కొలిమిగుండ్ల: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని నందిపాడు, హనుమంతుగుండం, బిఊప్పులూరు, పెద్దవెంతుర్ల, బెలుం గ్రామాల్లో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రసాయన పురుగు మందుల వినియోగం తగ్గించి జీవన పురుగు మందుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. వేసవిలో భూమిని లోతుగా దున్ను కోవాలని సూచించారు. పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకింగ్‌తో పాటు చలామణి తేదీని చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రతకూ ప్రాధాన్యత ఇవ్వాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు తెలిపారు. శనివారం మండలంలోని ఇల్లూరుకొత్తపేట బీసీ బాలుర వసతి గృహం సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఒత్తిడికి దూరంగా ఉండాలని, తగిన విశ్రాంతి తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉదయం, సాయంత్రం తగిన వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌డబ్ల్యూఓ రాజు, మౌనిక, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి



జోళదొరాశిలో ఇమ్యునైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

కోవెలకుంట్ల: మాతా మరణాల రేటును తగ్గించేందుకు కృషి చేయాలిన నాన్‌కమ్యూనికేబుల్ డిసీజెస్ అండ్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీసీడీ), రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమ(ఆర్‌బీఎస్‌కే) పీఓ కాంతారావు నాయక్ సూచించారు. శనివారం కోవెలకుంట్ల మండలం రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సున్నా నుంచి 12 ఏళ్లలోపు చిన్నారులకు వేస్తున్న టీకాలు రిజిస్టర్లు, టీకాలను భద్రపరిచే ఫ్రిజ్‌లను పరిశీలించారు. అదేవిధంగా జోలదొరాశి గ్రామంలో సిబ్బంది నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గిరిజ, ప్రభావతి పాల్గొన్నారు.

అలరించిన అంధుల గానకచేరి



పాటలు పాడుతున్న అంధులు

డోన్ టౌన్: స్థానిక పాతపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం అంధులు నిర్వహించిన గానకచేరి అలరించింది. నెల్లూరు జిల్లా గూడూరులో ఉన్న జ్ఞాననేత్ర అంధుల స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ శ్రీనివాస్, మిత్ర బృందం కలిసి ఈ గాన కచేరి చేసినట్లు పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ తెలిపారు. అనంతరం గానకచేరి చేసిన వారికి హెచ్ఎం, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మయ్య కలిసి రు.5వేలు, వృత్తి విద్య ఉపాధ్యాయుడు ప్రసాద్‌రావు తన తండ్రి సుబ్బారావు జ్ఞాపకార్థం రు.10వేలు అందించారు.

108లో ప్రసవం



బనగానపల్లెరూరల్: అవుకు మండలంలోని జూనుతల గ్రామానికి చెందిన మద్దిలేటి భార్య గర్భిణి వి.శారద 108 వాహనంలో శనివారం సురక్షితంగా పండంటి మగబిడ్డను ప్రసవించింది. 108 వాహన ఈఎంటీ మహమ్మద్‌రఫీ, పైలెట్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు శారదకు పురిటి నొప్పులు రావడంతో ఈ నెల 24న బనగానపల్లె ప్రభుత్వ కమ్యునిటీ వైద్యశాలకు తీసుకొచ్చారు. శనివారం తెల్లవారుజామున ఆమెకు పురిటి నొప్పులు అధికమై కాన్పు కష్టంగా మారడంతో వైద్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. 108 వాహనంలో శారదను తీసుకెళ్తుండగా టంగుటూరు సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే వాహనం నిలిపి ఆమెకు కాన్పు చేయడంతో పండంటి మగబిడ్డ జన్మించాడు. శిశువు, తల్లి ఆరోగ్యంగా ఉండడంతో శారదను మళ్లీ బనగానపల్లె ప్రభుత్వ కమ్యునిటీ వైద్యశాలలో చేర్పించినట్లు ఈఎంటీ తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సాంకేతిక పరిజ్ఞానం



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

డోన్ టౌన్: వైజ్ఞానిక ప్రదర్శనలతో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. పట్టణ సమీపంలోని శాంజ్యో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శనను ప్రారంభించి ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో చేసిన నాట్యం ఆకట్టుకుంది.

విజిలెన్స్ అధికారుల దాడులు

- పక్కా సమాచారంతో రెండు దుకాణాల తనిఖీ
- 35.07 టన్నుల ఎరువులు సీజ్... నిర్వాహకులపై 6ఏ కేసు



వెంకటసుబ్బయ్య ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అవుకు: మండల కేంద్రం అవుకులో విజిలెన్స్ అధికారులు శనివారం ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి అవుకు పట్టణం చేరుకున్న విజిలెన్స్ సీఐ నాగరాజు... సాధారణ వ్యక్తిలా రైతులతో మాట్లాడి ఎరువుల ధరల వివరాలు సేకరించారు. అనంతరం సీఐ తన సిబ్బందితోపాటు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావుతో కలిసి ఎంసీఎస్ నరసింహులు, బీసీ వెంకటసుబ్బయ్య ఎరువుల దుకాణాలతోపాటు గోడౌన్‌ను తనిఖీ చేశారు. ముందుగా దుకాణాల్లో స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం గొడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ మాట్లాడుతూ అవుకు పట్టణంలో ఎరువుల ధరలు ప్రభుత్వ ధరల కన్నా అధిక రేట్లకు విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని తెలిపారు. డీఏపీ రూ.1350 ఉండగా రూ.1400 నుంచి 1450 వరకు, యూరియా రూ.267 ఉండగా రూ.320 వరకు దుకాణాదారులు రైతులకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు బచ్చు చిన్న వెంకటసుబ్బయ్య దుకాణంలోని రూ.1.39లక్షలు విలువ చేసే 5.1టన్నుల డీఏపీని (103బ్యాగులు), అలాగే ఎంసీఎస్ నరసింహులు దుకాణంలోని రూ.1.77లక్షలు విలువ చేసే 29.97టన్నుల (656బ్యాగులు) యూరియాను సీజ్ చేశామన్నారు. దుకాణదారులపై 6ఏ కేసు నమోదు చేశామని, జేసీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారని సమాచారంతో మిగతా ఎరువుల దుకాణాదారులు తమ షాప్‌లను మూసివేశారు.

విజయ డెయిరీ పశుగ్రాసం సబ్సిడీ పంపిణీ

బనగానపల్లెరూరల్: స్థానిక విజయ డెయిరీ పరిధిలోని గ్రామాల పాడి రైతులకు సంస్థ మంజూరు చేసిన పశుగ్రాసం సబ్సిడీ నగదును యూనిట్ మేనేజర్ మధుసూదన్‌బాబు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఇల్లూరు కొత్తపేట గ్రామ సొసైటీలోని రైతులకు సంబంధించి రూ.31,540, ఇల్లూరు కొత్తపేట-2 సెంటర్‌కు రూ.61.770, ఇల్లూరు కొత్తపేటలోని క్రాంతి సెంటర్‌కు రూ.20,800ల, గులాంనబీ పేట సొసైటీకి రూ.28,100, కాపులపల్లి సెంటర్‌కు రూ.7,560, యాగంటిపల్లి సొసైటీకి రూ.34,840, యాగంటిపల్లి గ్రామంలోని మహేశ్వరమ్మ సెంటర్‌కు సంబంధించి రూ. 19, 014 చొప్పున సబ్సిడీ మొత్తాన్ని ఆయా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌బాబు మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం విజయ డెయిరీ సంస్థ అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

బనగానపల్లెరూరల్: పదవ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డోన్ డిప్యూటీ డీఈఓ సీజే క్రిష్టఫర్ సూచించారు. శనివారం పట్టణంలోని జెడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించాలని, నాణ్యమైన భోజనం అందజేయాలని ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు సూచించారు. పాఠ్యాంశాల్లో ఏదైనా సందేహం ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

క్రైం కార్నర్

ఆరుగురిపై వేధింపుల కేసు

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన ఆరుగురిపై శనివారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మౌలాలి తెలిపారు. కాలనీకి చెందిన నాగేంద్ర అనే వ్యక్తికి చాగలమర్రి మండలం మద్దూరుకు చెందిన సుమలత అనే మహిళతో 17సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కొంత కాలంగా భర్తతో పాటు అత్తమామలు లక్ష్మమ్మ, రంగన్న, బావ నాగరాజు, ఆడపడచులు రమణమ్మ, సుబ్బలక్ష్మి తనను వేధిస్తున్నారని సుమలత పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చెన్నంపల్లెకు చెందిన వ్యక్తిపై..

అవుకు: మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామానికి చెందిన వ్యక్తిపై శనివారం వేధింపుల కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నంపల్లెకు చెందిన కంబయ్య, వసుంధరకు పదకొండేళ్ల క్రితం వివాహమైంది. అయితే నాలుగేళ్ల నుంచి అదనపు కట్నంగా రూ.2 లక్షలు తీసుకురావాలని శారీరకంగా, మానసింగా వేధిస్తున్నారని ఆయన తెలిపారు. భార్య వసుంధర ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేశామని తెలిపారు.

మహిళ అదృశ్యం

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. శనివారం ఎస్ఐ అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే యువకుడికి అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన హారికతో పది నెలల క్రితం వివాహం జరిగింది. ఈనెల 23వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త సోమశేఖర్ సంజామల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: సంజామల మండలం నొస్సంలో శనివారం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.16,800, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ..

కోవెలకుంట్ల పట్టణంలో శనివారం అప్పు వ్యవహారంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు ఎస్ఐ మౌలాలి తెలిపారు. ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇదే గ్రామానికి చెందిన శేఖర్‌కు రూ.50వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ విషయంపై మండల కేంద్రం కోవెలకుంట్లలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శ్రీనివాసులుపై శేఖర్ దాడి చేయడంతో బాధితుడు పో లీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిటకిటలాడిన మద్దిలేటయ్య క్షేత్రం

బేతంచెర్ల: ప్రసిద్ధి చెందిన వైష్ణవ పుణ్య క్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,02,805 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

డోన్ : పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని, ఆ దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున విస్తరించివున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడలను అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శనివారం ఫ్లైఓవర్ గోడలపై ఉన్న వివిధ రకాల సినిమా, ప్రచార పోస్టర్లను చైర్మన్ సిబ్బందితో తొలగించారు. ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ (వినోదపు పన్ను) ట్యాక్స్ చెల్లించకుండా ప్రభుత్వానికి సంబంధించిన గోడలను ప్రైవేటు సంస్థలు ప్రచారానికి వినియోగించుకోవడం తగదన్నారు. ఇకపై ఇలాంటి ప్రచారాలను చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

